

రజతోత్సవ సభకు రావాలని ఐలాపూర్‌లో ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

## సభకు రండి

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామంలో వివిధ కుల సంఘాల నాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. అలాగే, గ్రామంలో బుడగజంగం సంఘాల ఆధ్వర్యంలో కొత్తగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ నెల 27న ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించి, అధినేత కేసీఆర్ నేతృత్వంలో నిర్వహించే సభకు తరలిరావాలని కోరారు. ఆయనవెంట నాయకులు పిడుగు సందయ్య, బద్ధం తుక్కారెడ్డి, మారు సాయిరెడ్డి, నరేశ్, బుడుగు జంగం, తదితరులు ఉన్నారు.



నాయకులు, కార్యకర్తలకు జెండాలు, కండువాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## చరిత్రలో నిలిచిపోయేలా సక్సెస్ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను దేశ చరిత్రలో నిలిచిపోయేలా సక్సెస్ చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. గురువారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులకు జెండాలు, కండువాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడారు. గులాబీ జెండా తెలంగాణ ప్రజల గుండెల నుంచి పుట్టిందని, దీనిని ఎవరూ విడదీయలేరని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కేవలం అధికారం మాత్రమే కోల్పోయిందని, ప్రజల్లో బీఆర్ఎస్ బలగం ఎంత ఉందో చూపించాలన్నారు. ప్రతి గ్రామం నుంచి 50 మందికి పైగా కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని, 27న ప్రతి ఇంటిపై గులాబీ జెండా ఎగురవేసి ఎల్కతుర్తి సభకు కదలాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, నాయకులు చెరుకుపెల్లి రాజిరెడ్డి, ఉడుతల వెంకన్న, గుండ ముత్తయ్య, కముటం రాములు, ఏనుకుల బుచ్చయ్య, బిల్లవేణి పరుశరాం, బొల్లవేణి రమేశ్, అనిల్, నాగరాజు, భాస్కర్, శ్రీధర్, పరశురాం, రమేశ్, కొమురయ్య, శంకర్, కనకయ్య పాల్గొన్నారు.



గంభీరావుపేట: ముస్తఫానగర్‌లో ధాన్యం సంచులతో రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

గంభీరావుపేట, ఏప్రిల్ 24: గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌లో కొనుగోళ్లలో జాప్యంపై రైతులు ప్రధాన రోడ్డుపై ఆందోళనకు దిగారు. కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రోడ్డుపై ధర్నా చేశారు. కేంద్రం ప్రారంభించి పది హేను రోజులవుతున్నా ఇప్పటివరకు రెండు లారీల వడ్లను మాత్రమే కొన్నారని, ఎక్కడి వడ్లు అక్కడే ఉన్నాయని, ఇలా అయితే ఇంకెన్నాళ్లకు పూర్తవుతుందని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ మారుతిరెడ్డి రైతులకు ఫోన్ చేసి వెంటనే కొనుగోలు చేసి ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

## రోడ్డెక్కిన అన్నదాత

- కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై ఆగ్రహం
- ఎర్రటి ఎండలోనూ ఆందోళన
- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట వన్‌పల్లి రైతుల ధర్నా
- ముస్తఫానగర్, చందుర్తిలోనూ నిరసనలు


**మొన్నటిదాకా పంటను కాపాడుకునేందుకు ఆగమైన రైతులు, ఇప్పుడు ధాన్యం అమ్ముకునేందుకు అరిగోస పడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంపై ఆగ్రహిస్తున్నారు. గురువారం వీర్నపల్లి మండలం వన్‌పల్లి, గంభీరావుపేట మండలం ముస్తఫానగర్, చందుర్తిలో రోడ్డెక్కారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా ధర్నాలు చేశారు. ఎక్కడికక్కడ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఫొటోలకు ఫోజులిచ్చి కేంద్రాలు ప్రారంభించారని, తీరా ధాన్యం తెస్తే రోజులు గడుస్తున్నా కాంటా పెట్టడం లేదని మండిపడ్డారు. రైతులను ఇలా ఇబ్బంది పెట్టడం ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నించారు.**



చందుర్తి: వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 24 : వీర్నపల్లి మండలం వన్‌పల్లికి చెందిన వంద మంది రైతులు సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. సుమారు 45 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి ఎర్రటి ఎండలోనే ఆందోళన చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి తమ గోడు వెల్లబోసుకుంటామని చెప్పుకొన్నా అధికారులెవరూ పట్టించుకోలేదు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే గేట్లను పోలీసులు మూసివేశారు. దీంతో కలెక్టరేట్ గేటు ఎదుట సుమారు గంటపాటు ధర్నా చేసినా కలెక్టర్ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో కరీంనగర్, సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. 'కలెక్టర్ రావాలి.. మా సమస్యను పరిష్కరించాలి' అని డిమాండ్ చేశా రు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, నెల క్రితమే కోతలు పూర్తయ్యాయని, ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలో కొనుగోలు పూర్తయి డబ్బులు కూడా రైతులకు అందించారన్నారు. అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని, కేవలం సిరిసిల్ల జిల్లాలోనే ఎందుకీ వివక్ష అని ప్రశ్నించారు. ఇపుడు కేవలం వన్‌పల్లి గ్రామస్తులం మాత్రమే ధర్నాకు వచ్చామని, సమస్య పరిష్కరించకుంటే ప్రతి గ్రామం నుంచి కలెక్టరేట్ వద్దకు చేరుకుంటామని రైతులు హెచ్చరించారు. కాగా, ఆందోళనతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోవడంతో ట్రాఫిక్ జాం అయింది. దీంతో పోలీసులు ఐదుగురు రైతులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వద్దకు తీసుకెళ్లారు. ధాన్యం కొనుగోళ్లు చేసి లారీలను పంపిస్తామని కలెక్టర్ ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు.

చందుర్తి, ఏప్రిల్ 24: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని చందుర్తి మండల రైతులు డిమాండ్ చేశారు. చందుర్తి మండల కేంద్రంలోని కోరుట్ల -వేములవాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి పది రోజులు గడిచినా ఇప్పటివరకు కేవలం నాలుగైదు లోడ్ లారీలే కొన్నారని మండిపడ్డారు. రైతులకు గన్నీ సంచులు ఇవ్వడం లేదని, హమాలీలు లేరని తూకం వేయడం నిలిపివేశారని ధ్వజమెత్తారు. పోలీసులు అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరవింపజేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో రైతులు మర్రి రాజు, మర్రి రాములు, బత్తుల కమలాకర్, సిరికొండ శ్రీనివాస్, మర్రి మల్లేశం, మింగని రవి, రమేశ్, లక్ష్మీరాజం పాల్గొన్నారు



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు




# రజతోత్సవ సభకు రెడీ!

## సన్నద్ధమైన గులాబీదండు

- శ్రేణులను ఏకం చేస్తున్న ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు
- నియోజకవర్గాల్లో విస్తృతంగా సభలు, సమావేశాలు
- స్వచ్ఛందంగా తరలేందుకు ఉత్సాహం చూపుతున్న శ్రేణులు
- మరోసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సత్తా చాటేదిశగా అడుగులు

**ఆది నుంచీ గులాబీ పార్టీకి అండగా నిలిచిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా మరోసారి తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలి వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల నుంచి వస్తున్న ఉత్సాహాన్ని చూసి.. అందుకు అనుగుణంగా సభకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చాలాచోట్ల స్వచ్ఛందంగా ఎవరికి వారే వాహనాలు సమకూర్చుకొని సభకు వెళ్లడానికి సిద్ధమవుతుండగా, ఆయా నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో వెళ్లే ప్రజలు, నాయకులకు కావాల్సిన తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తంగా చూస్తే ఉమ్మడి జిల్లా రజతోత్సవ సభలోనూ తనదైన ముద్ర వేసుకుంటుందన్న అభిప్రాయాలను ఆయా నియోజకవర్గాల నాయకులు స్పష్టం చేస్తున్నారు.**

కరీంనగర్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభకు సర్వం సన్నద్ధమవుతున్నది. ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే ఈ సభకు అత్యంత ప్రాధాన్యత ఉందన్న భావన ఇటు ప్రజల్లోనూ.. అటు పార్టీ శ్రేణుల్లోనూ బలంగా ఉన్నది. నాడు ఉద్యమానికి ఊపిరి పోసి.. ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించి.. పాలన పగ్గాలు చేపట్టిన తొలి పదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా కేసీఆర్ నిలిపిన విషయం తెలిసిందే. చాలా సందర్భాల్లో కేంద్రం అనేక పథకాలను ఆదర్శంగా తీసుకొని ప్రశంసించిన విషయం కూడా విదితమే. రైతుబంధు లాంటి పథకం దేశానికి ఒక దిశ-దశ చూపింది. అలాగే మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ, రైతు బీమా వంటి ఎన్నో పథకాలు దిక్సూచిగా మారాయి. కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో ముందుకెళ్తున్న విషయాన్ని అనేక నివేదికలు, సర్వేలు బహిర్గతం చేస్తున్నాయి. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని సైతం కాంగ్రెస్ పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న విపత్కర పరిస్థితులు, వివిధ వర్గాలు పడుతున్న కష్టాలు, అడుగంటిన భూగర్భజలాలు, కరెంటు కోతలు, పడిపోయిన రియల్ ఎస్టేట్ రంగం ఇలా ఏ కోణంలో, ఏ రంగంలో చూసినా తిరోగమనమే కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో రజతోత్సవ సభ ప్రాధాన్యత సంతరించుకున్నది. నిజానికి బీఆర్ఎస్ నాయకత్వం కూడా ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. అధికారం కోల్పోయిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేసి.. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఆ పార్టీ ప్రత్యేక దృష్టి పెడుతున్నది.

### శ్రేణుల్లో ఉత్సాహం

రజతోత్సవ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత నెల 23న ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సమావేశం కరీంనగర్‌లో నిర్వహించారు. ఆ మీటింగ్‌లోనే జనసమీకరణపై చర్చించి ఒక రూట్‌మ్యాప్ వివరించి వెళ్లారు. ఆయన ఆదేశాల ప్రకారం ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు.. తమ తమ నియోజకవర్గాల నుంచి వీలైనంత ఎక్కువగా ప్రజలు, నాయకులను సభకు తరలించేందుకు వీలుగా ఇప్పటికే అన్ని చోట్ల మీటింగ్‌లు నిర్వహించారు. పలు నియోజకవర్గాల్లో మండలాల వారీగా సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి సన్నాహక సమావేశం కూడా విజయవంతమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయా సమావేశాలకు పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలి రావడంతోపాటు రజతోత్సవ సభకు వెళ్లడానికి తమకు తాముగా చేసుకుంటున్న ఏర్పాట్లను వివరించిన తీరు.. వారిలో ఉత్సాహానికి నిదర్శనంగా చెప్పవచ్చన్న అభిప్రాయాలను రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు జరిగిన సమావేశాలను చూస్తే.. ప్రతి నియోజకవర్గం నుంచి లక్ష్యానికి మించి ప్రజలు, శ్రేణులు వెళ్తారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, సాధ్యమైన మేరకు ఉదయం నుంచే సభకు వెళ్లేందుకు కావాల్సిన ఏర్పాట్లను ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు చేస్తున్నారు.

### మరోసారి సత్తా

రజతోత్సవ సభను ఉమ్మడి జిల్లాలో పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా సభకు ఆయా గ్రామాల నుంచి ఎలా తరలి వెళ్లాలో రూట్‌మ్యాపులను సిద్ధం చేస్తూనే.. వాటిని పకడ్బందీగా అమలు చేయడానికి ఎక్కడికక్కడ పరిశీలకులను నియమించారు. ఇప్పటికే గ్రామాల వారీగా తరలి వచ్చే ప్రజలు, శ్రేణుల సంఖ్యకు అనుగుణంగా వాహనాలు, మంచినీటి సౌకర్యం వంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. నిజానికి బీఆర్ఎస్‌కు ఉన్న సభ్యుల లెక్క ప్రకారం చూస్తే సుమారు ఆరు లక్షల మంది పార్టీ శ్రేణులు ఉమ్మడి జిల్లా నుంచి తరలి వెళ్లే ఆస్కారం ఉన్నది. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీకి 7.50 లక్షల పైచిలుకు సభ్యత్వం ఉన్నది. అంటే సభ్యత్వం తీసుకున్న వారు వెళ్తే.. మరోసారి ఉమ్మడి జిల్లా తన ముద్ర వేసుకునే అవకాశముంటుంది. అలాంటిది ప్రతి పల్లె, వార్డు, డివిజన్ నుంచి ప్రజలు స్వచ్ఛందంగా మీటింగ్‌కు తరలి వెళ్లేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి లక్షలాది మంది తరలివెళ్లనున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు వెనుదన్నుగా నిలువడమే కాదు, పూర్వవైభవం కల్పించడంలో కీలక భూమిక పోషించే అవకాశముందన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## కేసీఆర్ మళ్లీ రావాలి.. బతుకులు బాగు పడాలి

- జగిత్యాలలో బీడీ కార్మికుల ఆకాంక్ష



జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతకు రూ. 4వేలు అందిస్తున్న బీడీ కార్మికులు

జగిత్యాల, ఏప్రిల్ 24 : 'రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన రావాలి. అందరి బతుకులు బాగుపడాలి. మా పింఛన్ ₹4 వేలు కావాలి' అని బీడీ కార్మికులు ఆకాంక్షించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో బీడీ కార్మికులను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పలుకరించగా, వారు తాము పడుతున్న ఇబ్బందులు చెప్పుకొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ₹4 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని మండిపడ్డారు. మహిళలకు ఇస్తానన్న ఏ ఒక్కహామీని ఈ ప్రభుత్వం నెరవేర్చ లేదని, ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని, మళ్లీ కేసీఆర్ వస్తేనే అందరి జీవితాలు బాగుపడతాయన్నారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, కవిత కృషితోనే తమకు పింఛన్ వచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ దారి ఖర్చుల కోసం ₹4 వేలను ఈ సందర్భంగా దావ వసంతకు అందజేశారు. అనంతరం దావ వసంత మాట్లాడుతూ, కేసీఆర్ వస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక, మాజీ కౌన్సిలర్ సంధ్య, నాయకులు గంగారెడ్డి, పెండెం గంగాధర్, ప్రశాంత్, వెంకట్ పాల్గొన్నారు.

## నష్టపరిహారం అందించాలి

- వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- ఎగ్లాస్‌పూర్‌లో దెబ్బతిన్న వరి పరిశీలన



ఎగ్లాస్‌పూర్‌లో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, ఏప్రిల్ 24: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎగ్లాస్‌పూర్‌లో రెండు రోజుల క్రితం వడగండ్ల వానతో రాలిపోయిన వరిని గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలు చెప్పుకొంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నాలుగు నెలల పంట నాలుగు నిమిషాల్లో నేలపాలైందని గోడు వెల్లబోసుకున్నారు. అనంతరం చల్మెడ రైతులకు భరోసా కల్పించి, మాట్లాడారు. పంట చేతికొచ్చే దశలో 150 ఎకరాల్లో నేలరాలి పోవడం బాధాకరమన్నారు. పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ కాక, రైతుభరోసా అందక, రైతుబీమా లేక రైతులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించేలా విప్ కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్లు సంకినేని రామ్మోహన్ రావు, నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, నేతలు గోపు పరశురాములు, కెంద గంగాధర్, వంశీకృష్ణరావు, శ్రీనివాస్ ఉన్నారు.

## సుర్రు.. సుర్రు

- ఉమ్మడి జిల్లాలో దంచికొడుతున్న ఎండలు

ఎండ భగ్గుమంటున్నది. ఉదయం తొమ్మిది గంటల నుంచే సుర్రుమంటున్నది. మధ్యాహ్నంకల్లా మాడు పగులుతున్నది. సాయంత్రం దాకా వేడి తగులుతున్నది. ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, గురువారం జగిత్యాల జిల్లాలో గరిష్ఠంగా 43 డిగ్రీలు నమోదయ్యాయి. పొద్దంతా వేడిగాలులు, ఉక్కపోతతో ప్రజలు తల్లడిల్లగా, మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇక కోల్‌బెల్ట్ అయితే ఇప్పుడే నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. ఇంట్లో ఉన్నా దగడు తాకుతున్నది. ఇటు ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వడదెబ్బలతో మరణాలు సంభవిస్తుండడం ఎండ తీవ్రతకు అద్దం పడుతున్నది. ఇప్పుడే ఇలా ఉంటే మేలో ఎలా ఉంటుందోననే భయం కనిపిస్తున్నది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్





వెలవెలబోతున్న నగరంలోని ప్రధాన మార్కెట్ ఏరియా